క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని 14 గ్రామాలలో శుక్రవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయిని మధు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.3 కోట్ల 10 లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, 4 గ్రామపంచాయతీ భవనాలు, 2 ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలకు శంకుస్థాపన చేస్తారని, కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

శివ్వంపేట(నర్సాపూర్): యాసంగిలో వరి సాగు సందర్భంగా విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి పెద్దగొట్టిముక్లలో తునికి కృషి విజ్ఞాన కేంద్రం, మల్లారెడ్డి కళాశాల విద్యార్థినులు శర్వాణి, సహన, శ్రీకరి, రశ్మిత స్నేహ, శైలజ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యాసంగిలో వేసే పంటలు, విత్తనాల ఎంపిక గురించి తెలిపారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం చేపట్టాలన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ పంటలో అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో రైతులు శ్రీశైలం యాదవ్, లక్ష్మీనారాయణ, హన్మంత్‌రెడ్డి, కృష్ణహరి తదితరులు ఉన్నారు.

సోషల్ ఆడిట్ పక్కాగా నిర్వహించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాలలో జరిగే సోషల్ ఆడిట్‌ను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. గురువారం చిలప్‌చెడ్ రైతువేదికలో పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో కలిసి ఆయన నిర్వహించిన సమావేశానికి ఎస్ఆర్పీ జీవన్ హాజరయ్యారు. మండలంలో సంవత్సరం పాటు జరిగిన ఉపాధి పనుల లెక్కలను ఆడిట్ చేయాలన్నారు. గ్రామాల్లో ఆడిట్ పూర్తయ్యాక మండలకేంద్రంలో ప్రజావేదిక ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్, ఈసీ భగవాన్‌రెడ్డి, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీఆర్పీలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మృతదేహం లభ్యం

తూప్రాన్: అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన పట్టణంలో జరిగింది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆబోతుపల్లి గ్రామ శివారులోని హల్దీవాగులో సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం ఉందని మున్సిపల్ వార్డు ఆఫీసర్ భాస్కర్ సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకుని పరిశీలిస్తే మృతుడి గొంతుకు శాలువ చుట్టి ఎరుపు రంగు నైలాన్ తాడు బిగించి ఉన్నట్లు గుర్తించారు. ఎవరో హత్య చేసి వాగులో పడవేసినట్లు అనుమానం వ్యక్తం జేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి



చాకలి మధు(ఫైల్)

కొడిపల్లి(నర్సాపూర్): చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందాడు. గురువారం ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సలాబత్‌పూర్‌కు చెందిన చాకలి మధు(18) ఈనెల 22న బైక్‌పై సొంతపని కోసం కొడిపల్లికి వెళ్తున్నాడు. కొడిపల్లి సమీపంలోనికి రాగానే అతనికి ఫిట్స్ రావడతో బైక్‌పై నుంచి కింద పడ్డాడు. దీంతో గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు. దీంతో కుటుంబసభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడు మధుకు నాలుగేళ్లుగా ఫిట్స్ వస్తున్నట్లు తెలిపారు. మధు తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మరమ్మతు పనుల పరిశీలన

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో పలు చోట్ల చేపట్టిన రోడ్ల మరమ్మతు పనులను మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ గురువారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. మరమ్మతులను సక్రమంగా చేపట్టాలన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమీపంలోను చేపట్టిన మరమ్మతులను మండల స్పెషలాఫీసర్ శ్రీనివాస్‌రావుతో కలిసి ఆయన పరిశీలించారు.

అధికారుల ముమ్మర తనిఖీలు

జిల్లావ్యాప్తంగా ఉన్న కేజీబీవీలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలను గురువారం మండల ప్రత్యేకాధికారులు, ఎంఈఓలు , అధికారులు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం వంటావార్పును పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో తనిఖీలు నిర్వహించారు. నిత్యావసర సరుకుల విషయమై నాణ్యత పాటించాలన్నారు. విద్యార్థులతో కలిసి వారు మధ్యాహ్న భోజనం చేశారు. హాస్టళ్లలో వసతులపై ఆరా తీశారు. పలు వసతిగృహాలలో టాయిలెట్స్ సరిపోవడం లేదని, కిటికీలు సరిగా లేవని తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. – నెట్‌వర్క్



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్ కేజీబీవీలో వంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్ ముసాద్దీక్



కొడిపల్లి: తునికి ఎంజేపీలో ఆర్‌సీఓ గౌతమ్‌రెడ్డి



శివ్వంపేట(నర్సాపూర్): అంగన్‌వాడీలో పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న ఉప తహసీల్దార్



నర్సాపూర్‌లోని ఓ హాస్టల్‌లో మండలస్థాయి కమిటీ సభ్యులు తదితరులు



చేగుంట(తూప్రాన్): వడియారం ప్రాథమిక పాఠశాలలో..



చిన్నశంకరంపేట(మెదక్): శాలిపేట అంగన్‌వాడీ కేంద్రంలో..



కొడిపల్లి: ఎస్టీ గురుకులంలో అన్నాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎల్‌పీఓ యాదయ్య

డంపింగ్ యార్డు ఏర్పాటయ్యేదెన్నడో?

పెద్దశంకరంపేటలో డంపింగ్ లేక చెరువు కట్ట సమీపాన, రేగోడ్ వెళ్లే దారిలో చెత్త పడేయడం, అక్కడే తగలబెట్టడం జరుగుతోంది. చుట్టుపక్కల ప్రాంతాల్లో పొగ కమ్ముకోవడం.. ఇందులోంచి వస్తున్న దుర్వాసనతో జనాలు అల్లాడిపోతున్నారు. పందులు, కుక్కలు సైతం చెత్తాచెదారాన్ని చిందరవందర చేస్తున్నాయి. దాని వల్ల వస్తున్న దుర్గంధాన్ని స్థానికులు భరించలేక పోతున్నారు. మాంసపు దుకాణదారులు సైతం జీవాల వ్యర్థాలను పడేస్తున్నారు.

- చెరువు కట్ట సమీపాన చెత్త పారబోత
- రేగోడ్ వెళ్లే దారిలోను తగులబెడుతున్న మున్సిపల్ సిబ్బంది
- వెదజల్లుతున్న దుర్గంధం
- ఇబ్బందుల్లో ప్రజానీకం



పెద్దశంకరంపేటలో ప్రధానరహదారి వెంట పడేసిన వ్యర్థాలు



రేగోడ్ వెళ్లే దారిలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో 14 వార్డులున్నాయి. ఇక్కడ కేవలం ట్రాక్టర్ ఏర్పాటు చేశారు. అన్ని కాలనీల నుంచి చెత్తాచెదారాన్ని సేకరించి స్థానిక చెరువుకట్ట సమీపంలో రహదారి పక్కన వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో పాటు రేగోడ్‌కు వెళ్లే దారిలో కూడా రహదారి వెంట చెత్తను వేసి తగలబెడుతున్నారు. నిత్యం మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులు, ప్రజలు వ్యర్థాల దర్వాసనను భరించలేకున్నారు. పైగా మంటల వల్ల వచ్చే పొగ కాలుష్యం పెరుగుతుంది. దోమలు, ఈగల తీవ్రత అధికంగా ఉందని చుట్టుపక్కల ప్రజలు చెబుతున్నారు. రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఈ చెత్త కుప్పల వద్ద కుక్కలు, పందుల సంచారిస్తూ చెత్తను చిందరవందరగా చేస్తున్నాయి. పలువురు జంతువుల వ్యర్థాలను తెచ్చి చెరువుకట్ట పక్కనే వేస్తుండగా తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది.

ప్రభుత్వ స్థలాలున్నా..

మండల కేంద్రంలో 14 వార్డుల్లో 10 వేల వరకు జనాభా ఉన్నారు. మండలం కేంద్రం విస్తరిస్తుండడంతో నూతన గృహాలు, ఇతర వాణిజ్య, వ్యాపార సముదాయాలు ఏర్పాటవుతున్నాయి. వీటి నుంచి వచ్చే వ్యర్థాల సేకరణకు చిన్న పాటి మినీ వాహనాలతో పాటు డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా పెద్దగా ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రభుత్వ స్థలాలు ఉన్నా దీనిని అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా వారు స్పందించి డంప్‌యార్డును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగిస్తున్నాం

మండల కేంద్రంలోని అన్ని వార్డుల్లో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తున్నాం. డంపింగ్‌యార్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. మినీ చెత్తవాహనాల కేటాయించాలని కూడా ప్రతిపాదనలు చేస్తాం.

– వెంకటరాములు, గ్రామకార్యదర్శి, పెద్దశంకరంపేట

ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెరగాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



కొడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని, మానసిక ఆత్మస్థైర్యం పెరుగుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గౌతోజీగూడెంలో గ్రామస్తుల, దాతల సహకారంతో హనుమాన్ మందిరంలో పునర్నిర్మాణం చేపట్టగా ప్రత్యేక అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. హోమం, ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. దాతలను గ్రామస్తులు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ రేణుకుమార్‌లు శాలువాతో సత్కరించి, మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో శివ్వంపేట మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్రంగౌడ్, జెడ్పీ మాజీ కోఆప్షన్ మన్సూర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి శ్రీనల్ల పోచమ్మదేవిని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శివ్వప్ప, విఘ్నేశ్, రాజేశ్ అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై మొదలైన వ్యతిరేకత

- రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్



మాట్లాడుతున్న శోభన్

మెదక్ కలెక్టరేట్: తెలంగాణ రైతుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ విమర్శించారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిసాన్ భవన్‌లో రైతు సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సంఘం జిల్లా కార్యదర్శి చింతల గౌరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పట్ల రైతాంగంలో వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని మండిపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదన్నారు. వానాకాలం సీజన్‌లో కేవలం ఆరు లక్షల మందికే పంట రుణాలు ఇచ్చారన్నారు. వానాకాలం రైతు భరోసాను ఎగవేసే ప్రయత్నం చేస్తున్నదన్నారు. రైతు భరోసాను యాసంగితో కలిపి వెంటనే రైతులకు చెల్లించాలన్నారు. ధరణిలోని లోపాలను ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్నప్పటికీ పరిష్కారం కాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలను సీసీఐ పెంచాలని, తేమ పేరుతో రైతాంగానికి నష్టం చేయొద్దన్నారు. కౌలు రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి చింతల గౌరయ్య, నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

డీఎస్పీ ప్రసన్నకుమార్



ప్రశ్న పత్రాన్ని ఆవిష్కరిస్తున్న మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్

మెదక్ మున్సిపాలిటీ: విద్యార్థులు ఇప్పటి నుంచే శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించుకోవాలని, మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న జేవీవీ జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ప్రశ్న పత్రాన్ని సైతం ఆవిష్కరించారు. సమాజంలో జరుగుతున్న మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు జన విజ్ఞాన వేదికల(జేవీవీ) ద్వారా ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. మూఢనమ్మకాల జోలికి వెళ్లకుండా విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలన్నారు.

సమాజంలో యువత పాత్ర కీలకం

సీఐ నాగరాజు

మెదక్ మున్సిపాలిటీ: సమాజంలో యువత పాత్ర కీలకమని మహిళల చైతన్యంతోనే దేశం అభివృద్ధి సాధ్యమని టౌన్ సీఐ నాగరాజు, సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేశ్ అన్నారు. మెదక్ టౌన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో మహిళల రక్షణ– సైన్స్– మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. సమాజంలోని మూఢనమ్మకాలను పట్టించుకోకుండా శాస్త్రీయ సమాజ నిర్మాణానికి విద్యార్థులు నడుం బిగించాలన్నారు. దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా మోసం చేస్తున్నారన్నారు. మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని, డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాంత్రికులు, భూత వైద్యులు మోసం చేసే కుట్రలను తన మ్యాజిక్ షో ద్వారా కళ్లకు కట్టినట్లు నరేశ్ చూపారు.

అందమైన చేతిరాతకు ప్రత్యేక మార్కులు

శివ్వంపేట(నర్సాపూర్): అందమైన చేతిరాత వల్ల విద్యార్థులకు ప్రత్యేక మార్కులు లభిస్తాయని మోటివేషన్ స్పీకర్, ప్రముఖ చేతిరాత నిపుణులు అహ్మద్ అన్నారు. గురువారం మండల పరిధిలో ఉన్న చండీ ఉన్నత పాఠశాల, నవాబుపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చేతిరాత ప్రాముఖ్యత, రాసే విధానం గురించి అవగాహన కల్పించారు. చేతిరాత స్పష్టంగా, అందంగా రాయడంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని ఉన్నత చదువులు చదువుకుని మంచిస్థాయి ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నబాబుపేట రాజిరెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం దయానంద్‌రెడ్డి, ఉపాధ్యాయులు సంతోశ్‌కుమార్, గౌరిశంకర్, అరుణ, షాబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



అహ్మద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

డిమాండ్లు నెరవేర్చాలని నిరసన



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్ కేజీబీవీలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): కేజీబీవీలలో పని చేసే బోధన, బోధనేతర సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని టీఎస్‌యూటీఎఫ్ స్టేట్ కమిటీ సభ్యురాలు మధులత అన్నారు. గురువారం చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామ శివారులో గల కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బందితోపాటు తాను.. భోజన విరామ సమయంలో డిమాండ్లను నెరవేర్చాలంటూ నిరసన వ్యక్తం చేశారు. సిబ్బందితో వెట్టి చాకిరీ చేయిస్తున్నారన్నారు. అయినప్పటికీ సరైన వేతనం ఇవ్వడం లేదన్నారు. సమానపనికి, సమాన వేతనం ఇవ్వడంతో పాటు సిబ్బందికి సంవత్సరానికి 27 రోజులు సెలవులు ఇవ్వాలన్నారు. అదేవిధంగా హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేర్ టేకర్స్‌ను నియమించడంతో పాటు, పార్ట్ టైమ్ బోధకులను, ఫుల్ టైం బోధకులుగా మార్చాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అంజలి, ఉమామహేశ్వరి, శారద పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలోను

చిన్నశంకరంపేట(మెదక్): కస్తూర్బా పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ కేజీబీవీ ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ నాగరాణి డిమాండ్ చేశారు. గురువారం చిన్నశంకరంపేట కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగులు రెండోరోజు కూడా తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కస్తూర్బా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 16 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగ భద్రత లేదని అభద్రత భావంతోనే విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

కుంటలో రెండు హుండీలు లభ్యం



నీటికుంటలో పడేసిన హుండీలు

తూప్రాన్: గుర్తు తెలియని దేవాలయం నుంచి దొంగలించిన రెండు హుండీలు నీటికుంటలో లభ్యం అయినట్లు ఎస్ఐ శివానందం గురువారం తెలిపారు. వెంకటాపూర్(పీటీ) గ్రామ సమీపంలో ఉన్న కుంటలో రెండు హుండీలను గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా దొంగలు వాటిని పగలగొట్టి కుంటలో పడేశారన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. ఇవి ఏ దేవాలయానికి చెందినవో తెలియాల్సి ఉందని, ఆ మేరకు దర్యాప్తు చేపట్టామన్నారు. శివ్వంపేటలోని ఓ దేవాలయంలో గతంలో హుండీలు చోరీకి గురయ్యారన్నారు. ఆ కోణంలో దర్యాప్తు చేపట్టామన్నారు.



కొల్చారం(నర్సాపూర్): కోనాపూర్...



రామాయంపేటలో..

జ్యోతిరావు పూలే చిరస్మరణీయుడు

అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని వక్తలు కొనియాడారు. ఆయన వర్ధంతి సందర్భంగా చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక సమానత్వం కోసం అహర్నిశలు తాపత్రయం పడ్డారని గుర్తు చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, ప్రజాసంఘాల నేతలు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

–నెట్‌వర్క్